క్లుప్తంగా

డైట్‌లో ఇంగ్లిష్ వీక్



ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో ఇంగ్లిష్ వీక్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడారు. ఆరుగురు ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బాలాజీరావు, పీడీ దశరథరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో వెలసిన కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన వివిధ వ్యాపారులకు అన్నదానాన్ని 18వ వార్డు కౌన్సిలర్ జయంతి ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సీతారామిరెడ్డి, భరత్, విల్సన్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణయ్య, స్థానికులు పెంచలయ్య, గౌస్‌బాషా, శేఖర్, వెంకటస్వామి, వేణు, ప్రసాద్, బాబు పాల్గొన్నారు.

వేడుకగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఫ్లెక్సీలు చించే సంస్కృతి టీడీపీదే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో మెలుగుతారని.. ఫ్లెక్సీలు, బ్యానర్లను చించే నీచ సంస్కృతి టీడీపీ నేతలదేనని పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. కోడూరులో నాలుగు రోజుల పాటు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ విజయవంతంపై స్థానిక సచివాలయంలో పార్టీ నేతలు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన మండల స్థాయి అధికారులు, తదితరులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

టీడీపీ నేతల నాటకమే..

కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం సెంటర్‌లో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫ్లెక్సీల చించివేత ఆ పార్టీ నేతల డ్రామానేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత రంగారెడ్డి చెప్పారు. గత నెల 28న సోమిరెడ్డి జన్మదినమైతే.. మరుసటి రోజు ఫ్లెక్సీలను కట్టాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అయినా తాము పట్టించుకోకుండా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సాగించామన్నారు. జీర్ణించుకోలేని టీడీపీ నేతలు.. సోమిరెడ్డి ఫ్లెక్సీలను చించుకొని ఆ నిందను తమపై మోపేందుకు యత్నించారని ఆరోపించారు. వైస్ ఎంపీపీ నీలమ్మ, పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర, సునీల్, దుర్గా, సురేష్, శ్రీరాములు, వీరరాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. లలితా జ్యువెలరీ, శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు నిర్వహించిన జాబ్‌మేళాకు 153 మంది హాజరుకాగా, 71 మందికి నియామక పత్రాలను అందజేశామని తెలిపారు. జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రికి సత్కారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో డీసీసీబీ ఉద్యోగులు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. డీసీసీబీ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, బ్యాంక్ ఏజీఎం మధుసూదన్‌రావు, శ్రీనివాసులురెడ్డి, యూనియన్ నేతలు శ్రీహరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా సంక్షేమ పథకాల అమలు



సంక్షేమ పథకాల అమలును ఆరాతీస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్ర చరిత్రలో సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని నిడిగుంటపాళెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. మంత్రికి పూలు, కర్పూర హారతులతో స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఏమైనా ఉన్నాయానని ప్రశ్నించగా, జగనన్న పాలనలో వచ్చే సంక్షేమ పథకాలతో తాము చాలా సంతోషంగా జీవిస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రి మాట్లాడారు. హామీల్లో 95 శాతాన్ని అమలు చేసిన ఏకైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతుండటంతో సీఎం పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబు అన్ని విధాలా మోసం చేశారు

గత టీడీపీ పాలనలో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు అన్ని విధాలా మోసం చేశారని మంత్రి ఆరోపించారు. రుణమాఫీ చేస్తానని మోసం చేసిన ఆయనకు గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. చంద్రబాబు పాలనలో తాను ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గ్రామాల్లో ఎక్కడికెళ్లినా ప్రజలు తమ సమస్యలను చెప్పేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు జేజేలు పలుకుతున్నారని తెలిపారు. మండలంలో దాదాపు రూ.135 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. నిడిగుంటపాళెంలోనే రూ.5.3 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని వెల్లడించారు. ఎంపీడీఓ సుస్మిత, సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీ ప్రవల్లిక, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య, పార్టీ నేతలు శ్రీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, నరసయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం



ముత్తుకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫ్లెక్సీలకు ముత్తుకూరు మండల పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో క్షీరాభిషేకాన్ని శనివారం చేపట్టారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధులకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మత్స్య కళాశాలలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి హాజరుకాగానే సీఎంకు మహిళలు జేజేలు పలుకుతూ, వారి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు



సూచనలు చేస్తున్న నాగరాజు

వెంకటాచలం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ నాగరాజు ఆదేశించారు. మండలంలోని కసుమూరు, చవటపాళెం గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన జగనన్న కాలనీలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కసుమూరులోని మూడు లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన మెటీరియల్‌తో పాటు బిల్లులను ప్రభుత్వం సత్వరమే మంజూరు చేస్తోందనే అంశాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని కోరారు. చవటపాళెంలో కొత్తగా నిర్మించనున్న లేఅవుట్లలో లబ్ధిదారుల జాబితాను గృహ నిర్మాణ శాఖ అధికారులకు రెండో రోజుల్లో అందజేయాలని తహసీల్దార్ కృష్ణకు సూచించారు. డీఈ వరప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో మంచి ఆరోగ్యం



ఇందుకూరుపేటలో..



బుచ్చిరెడ్డిపాళెంలో..

ఇందుకూరుపేట: చిరు ధాన్యాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల పేర్కొన్నారు. గంగపట్నం మజరా టీవీకండ్రిగలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం సీమంతాలను జరిపారు. వివిధ రకాల పౌష్టికాహారం, చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, రాజేశ్వరి, సుమ, స్వరూప, చాముండేశ్వరి, రమణమ్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: చిరు ధాన్యాలతో పోషక విలువలు పెరుగుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతలమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తకాశీపాళెంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా చిరుధాన్యాలను తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న శకుంతలాదేవి

మనుబోలు: నాటు సారాను తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని నెల్లూరు రెండో పట్టణ ఎస్‌ఈబీ ఎస్సై శకుంతలాదేవి హెచ్చరించారు. ఎస్‌ఈబీ జేడీ హైమావతి ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో మహిళా పోలీసులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో మద్యాన్ని అక్రమంగా విక్రయించినా.. బెల్టుషాపులను నిర్వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నాటు సారా రవాణా, తయారీని అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని చెప్పారు. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఎస్సై ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభి షేకం



పొదలకూరు: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని అయ్యప్పనగర్‌లో గల శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సీతారాముల పట్టాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో నిత్యాన్నదానానికి విరాళాన్ని దాతలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడారు. రేబాలకు చెందిన ఆదిశంకర్‌రెడ్డి జ్ఞానార్థం ఆయన సతీమణి అహల్యమ్మ రూ.25 వేలను అందజేశారని చెప్పారు. రెండు శాశ్వత నవావరణ పూజలకు రూ.32,232ను అందజేశారని పేర్కొన్నారు. ఈఓ వెంకటసుబ్బయ్య పాలకమండలి సభ్యుడు రఘురామయ్య పాల్గొన్నారు.

పుంజులూరుపాడులో మంత్రి కాకాణి పర్యటన నేడు

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుంజులూరుపాడులో ఆదివారం పర్యటించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటశేషయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకొని సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించనున్నారని చెప్పారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నారని వివరించారు.

మనుబోలు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మనుబోలుకు ఆదివారం రానున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ హరగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీపీఆర్ కల్యాణ మండపంలో ఉదయం పది గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నారని చెప్పారు. అనంతరం డీపీఆర్ కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లతో సమావేశం కానున్నారని పేర్కొన్నారు.

మహిళా పోలీసులతో సమీక్ష

కోవూరు: నేర నియంత్రణలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలు చెడు వ్యసనాలకు బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఎస్‌ఈబీ సీఐ నరహరి కోరారు. విడవలూరు మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ మద్యం, గంజాయి, తదితరాలపై నిఘా ఉంచాలని కోరారు. బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులను అరికట్టాలని సూచించారు.

6న వాహనాల వేలం

వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని ఎస్‌ఈబీ సీఐ నరహరి పేర్కొన్నారు. కోవూరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద మూడు బైక్‌లను వేలం వేయనున్నామని పేర్కొన్నారు. పాల్గొనాలనుకునే వారు కార్యాలయాన్ని సంప్రదించి ధరావతును చెల్లించాలని కోరారు.

దయాకర్‌రెడ్డి మృతికి మంత్రి సంతాపం



పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

ముత్తుకూరు: వెంకటాచలం మండలంలోని అక్రంవారికండ్రిగలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పర్యటించారు. గ్రామ సర్పంచ్ అనూరాధ భర్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దువ్వూరు దయాకర్‌రెడ్డి (58) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో పార్థివదేహానికి మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నేతలు సుబ్బరామిరెడ్డి, కోదండరామరెడ్డి, బాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జింకల కోసం విద్యుత్ కంచెలు

వెంకటాచలం: తిక్కవరప్పాడు – సర్వేపల్లి మధ్య గల అటవీ ప్రాంతంలో విద్యుత్ కంచెలను అక్రమంగా ఏర్పాటు చేసి జింకలు, పందులను వేటాడుతున్నారనే అంశం శనివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తిక్కవరప్పాడు – సర్వేపల్లి మధ్య గల అటవీ ప్రాంతంలో జింకలు, అడవి పందులను వేటాడేందుకు గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు సమీపంలోని మెయిన్‌లైన్‌కు విద్యుత్ కనెక్షన్లను అక్రమంగా ఇచ్చారు. విషయాన్ని గుర్తించిన సర్వేపల్లి గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల రాకతో గుర్తుతెలియని వ్యక్తులు ఓ బైక్‌ను వదిలి పరారయ్యారు. బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇచ్చిన వ్యక్తులపై ఆరా తీస్తున్నారు.

యాళి వాహనంపై కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలో కొలువైన కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు యాళి వాహనంపై శనివారం దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. ఆలయ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో పొదుపు సభ్యులకు మరింత భద్రత



ఆసరా చెక్కును అందజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): రాష్ట్రంలోని అక్కాచెల్లెమ్మలను ఆదుకునేందుకు గానూ ఆసరా పథకం ద్వారా రూ.కోట్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరులో శనివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆసరా చెక్కులను పొదుపు సంఘాల సభ్యులకు శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని 907 సంఘాల సభ్యులకు రూ.6.43 కోట్లను ఆసరా పథకం ద్వారా అందజేయడం గొప్ప విషయమని చెప్పారు. హామీని నిలబెట్టుకోలేక 2014 ఎన్నికల తర్వాత పొదుపు సంఘాల సభ్యులను చంద్రబాబు ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. దీంతో బ్యాంకులకు రుణాలు చెల్లించడంలో మహిళలు అవస్థ పడ్డారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇప్పటికే మూడు దఫాలుగా ఆసరా పథకం ద్వారా నిధులను సీఎం అందజేశారని వివరించారు. ఆర్థిక ఇబ్బందులతో గతంలో ఇబ్బందులు పడిన వారు ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు.

గడప గడపలో ఆత్మీయత

ఊటుకూరులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలోని వృద్ధురాలు మంగమ్మ తాను ఈసారి సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికే ఓటేస్తానని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో గ్రామానికి రూ.15.75 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ మాజీ సభ్యుడు విజయభానురెడ్డి, అచ్యుత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణారెడ్డి, వాణిజ్య విభాగ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ శేషమ్మ, ఎంపీటీసీ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



మనుబోలు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న శేషాద్రివాసు

పొదలకూరు: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. పరీక్షలు సోమవారం ప్రారంభంకానున్నాయి. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 793 మంది పరీక్షలు రాయనున్నారని ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఏన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్లో 187 మంది, బాలికోన్నత పాఠశాలలో 185 మంది, నాగార్జున స్కూల్లో 213 మంది, మహ్మదాపురం హైస్కూల్లో 208 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

మనుబోలు: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నామని ఎంఈఓ శేషాద్రివాసు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాలుర పాఠశాలలో 35 మంది, బాలికల పాఠశాలలో 160 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారని చెప్పారు. అనంతరం పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, కరెంట్ సౌకర్యం, మరుగుదొడ్లు సక్రమంగా ఉన్నాయాననే అంశాన్ని ఆరాతీశారు. కో ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు డేవిడ్, వసంతకుమారి పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటశేషసాయి సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్జి దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని, ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

విష్ణు ఆలయంలో పూజలు



భక్తులకు అన్నదానం

మనుబోలు: ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవుడికి పంచామృతాభిషేకాలను అర్చకుడు హనుమాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా భాస్కర్‌రెడ్డి, భారతమ్మ దంపతులు వ్యవహరించారు.

అసత్య కథనాలు తగవు

కోవూరు (విడవలూరు): పార్లపల్లి సొసైటీపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు అసత్యమని, తమ ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని సొసైటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పార్లపల్లి సొసైటీ కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. గత టీడీపీ హయాంలో అప్పటి పెయిడ్ సెక్రటరీ శేషగిరిరావు ఆధ్వర్యంలో రూ.మూడు కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై విచారణ జరుగుతోందని వివరించారు. కోఆపరేటివ్ చట్టంలోని ఆర్టికల్ 51 ప్రకారం తమ సొసైటీలో పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలని కోరారు. డైరెక్టర్లు మల్లికార్జునరెడ్డి, మల్లికార్జున, రామ్‌ప్రసాద్, హరి, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరుకు అదనపు పీహెచ్‌సీ మంజూరు

పొదలకూరు: మండలానికి అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. మండలానికి మరో పీహెచ్‌సీ (కో – లొకేటెడ్) మంజూరు చేయడంతో పాటు డాక్టర్లుగా కిరణ్‌రిషిత, శ్రీకావ్యను నియమించారని చెప్పారు. తాత్కాలికంగా పొదలకూరు సీహెచ్‌సీలో అదనపు కేంద్రాన్ని నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం పీహెచ్‌సీని ఎక్కడ ఏర్పాటు చేసే అంశంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారని చెప్పారు. అదనపు పీహెచ్‌సీకి భవిష్యత్తులో నూతన భవనం, సిబ్బంది యథావిధిగా ఉంటారని తెలిపారు.